రంజాన్ వేళలు
ఇఫ్తార్ - గురువారం
సాయంత్రం - 6.33
సహర్ - శుక్రవారం
ఉదయం - 4.57



ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు సాగులో సలహాలు, సూచనలు చేసేందుకు ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. రైతునేస్తం కార్యక్రమం పేరిట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నదాతలకు సమస్త సమాచారం అందిస్తోంది. దీంతో సాగుకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో రైతులు నేరుగా మాట్లాడే వెసులుబాటు కలిగింది. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

అన్నదాతకు అభయం..
రైతు నేస్తం!

- రైతు వేదికలకు ఆధునిక సాంకేతికత
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు, సూచనలు
- సాగుకు సంబంధించి సమస్త సమాచారం అందుబాటులోకి..

మేడ్చల్ మార్చి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు వేదికలకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆధునిక సాగులో అన్నదాతలకు అధికారులు, శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగానే సీఎం తెలంగాణ సచివాలయం నుంచి ఈనెల 6న రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గానికి ఒక రైతు వేదికను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 9రైతు వేదికలు ఉండగా అందులో మూడుచింతలపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశారు. గతంలో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పంటలకు ఏదైనా చీడ పీడలు వస్తే వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ప్రస్తుతం రైతు నేస్తం ద్వారా రైతు వేదికల్లో ఆధునిక సాంకేతిక సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్తు నీటి పారుదల శాఖలకు సంబంధించి అన్ని ప్రభుత్వ పథకాల సమాచారం అందించనున్నారు. ఇప్పటి వరకు కేవలం వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బంది మాత్రమే పొలాలకు వెళ్లి పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆయా పంటలకే పరిమితం కాకుండా మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్తు , సాగునీటికి సంబంధించిన సమస్యలపై కూడా శాస్త్ర వేత్తలు, ఉన్నతాధికారులు కూడా వీరి సందేహాలను నేరుగా నివృత్తి చేసేందుకు అవకాశం ఏర్పడింది.

భద్రత కరువు...

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో నిర్మించిన రైతు వేదికల్లో ఎక్కువ శాతం గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్నాయి. ఒక్కోదానిలో వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన రూ. 3.7 లక్షల విలువ చేసే సామగ్రిని అందులో ఏర్పాటు చేశారు. రాత్రి వేళ రక్షణ లేకపోవడంతో ఈ సామగ్రికి భద్రత కరువైంది. రైతు వేదికల్లో పూర్తిస్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తే తప్పకుండా రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మూడుచింతలపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతి మంగళ, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటలకు సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడుతారు. సమస్యలకు పరిష్కారం చూపుతారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- మేరీరేఖ, జిల్లా వ్యవసాయాధికారి



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న క్రిస్టినా చోంగ్తు

మెడికల్ కాలేజీ ఏర్పాటుకు
ప్రతిపాదనలు పంపాలి

- వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు

మేడ్చల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించి కలెక్టర్ గౌతమ్ సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కాలేజీ ఏర్పాటుకు అవసరమైన మౌళిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల ఏర్పాటుతో పాటు ఆరోగ్య సంరక్షణకు కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపుకలెక్టర్ అభిషేక్‌అగస్త్యా తదితరులు పాల్గొన్నారు.

16 మంది సభ్యుల బృందం సందర్శన

నేషనల్ డిఫెన్స్ కాలేజ్ ఆఫ్ మినిస్ట్రీ, డిఫెన్స్ కోర్స్ ఆన్ నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ 16 మంది సభ్యుల బృందం బుధవారం బయాలాజికల్ ఇండస్ట్రీస్‌ను సందర్శించారు. అనంతరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టర్‌కు విచ్చేసిన బృందానికి కలెక్టర్ గౌతమ్ సాదరస్వాగతం పలికారు. జిల్లా పరిపాలన, వివిధ శాఖల గురించి సభ్యులకు కలెక్టర్ వివరించారు.



చీర్యాల్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

కీసర, మార్చి 20: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. మండల పరిధి చీర్యాల్ గ్రామంలోని సర్వేనంబర్ 59 సీలింగ్ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బుధవారం ఎక్స్‌కవేటర్ సాయంతో 9 నిర్మాణాలను కూల్చివేయించారు. అంకిరెడ్డిపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 888, 889, 918లో గల ప్రభుత్వ భూమిలో ప్రహరీ ఏర్పాటు చేయడంతో కూల్చివేశారు. ఆ భూమిపై సరిహద్దు వివాదం ఉన్నందున ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, సర్వే చేసిన అనంతరం నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ భూమి పక్కన ఉన్న పట్టాదారులు, ప్రతినిధులకు తెలియజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమైందని.. అసలు అభ్యర్థులెవరో కూడా నిర్ణయించలేనిస్థితిలో అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీలున్నాయని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టిన ఆయన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి అన్నివర్గాల వారిని కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి వరుసగా మూడోసారి బరిలో దిగుతున్న ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలపై మాట్లాడారు. ప్రధాని మోదీనే మాకు బలం... ఆయన నిజాయితీని ప్రజలు నమ్ముతున్నారు... నన్ను కాదు దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధాని మోదీని చూసి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ఓటు బ్యాంకు రాజకీయాలను చేసే వారికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మాకు పోటీనే లేదని, ఎన్నికల్లో తాను 3లక్షల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ తమకు దారిదాపుల్లో కూడా లేవని.. అసలు వారి అభ్యర్థులు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి క్యాండిడేట్లు దొరకక రూ.10వేల కోట్ల భూ దోపిడీ చేసిన వారిని అరువు తెచ్చుకుని పోటీ చేస్తుందని ఎద్దేవా చేశారు. తాను గెలిస్తే వికారాబాద్ దిశ, దశ మారుస్తానన్నారు. ఇంకా ఆయన ఏమన్నారో ఆయన మాటల్లోనే....

ఆంధ్రజ్యోతితో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మా బలం
మోదీనే!

- నాకు ప్రత్యర్థులే లేరు
- అధికార పార్టీకి క్యాండిడేట్లే దొరకడం లేదు
- రూ. 10వేల కోట్ల కుంభకోణం చేసిన వారికి టికెట్లు
- కాంగ్రెస్ దుష్ప్రచారం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి
- కవిత అరెస్ట్‌తో కాంగ్రెస్ అసత్యప్రచారానికి తెరపడింది
- నేను గెలిస్తే వికారాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వికారాబాద్ వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకొస్తా

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీనే మాకు ప్రధాన ప్రచార అస్త్రం. ఆయనే మాకు బలం.. ఆయన నిజాయితీని దేశ ప్రజలు గుర్తించారు. ఆయనపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. మోదీ అంటేనే బీజేపీ.. బీజేపీ అంటేనే మోదీ. అందుకే నన్ను కాదు మోదీని చూసి చేవెళ్లలో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నాను. అదే కాంగ్రెస్ వాళ్లు రాహుల్‌గాంధీని చూసి ఓటు వేయాలని కోరగలుగుతారా? ఒక్క అభ్యర్థి కూడా రాహుల్ గాంధీపేరుతో ఓట్లు అడిగే ధైర్యం లేదు. ఇదే మా బలం... ఇదే కాంగ్రెస్ బలహీనత. ఇండియా కూటమి వారికే రాహుల్ గాంధీపై నమ్మకం లేదు. ఇంకా ఓట్లెలా అడుగుతారు. అసాధ్యమైన హామీలు ఇచ్చి తరువాత కాంగ్రెస్ మోసం చేస్తుంది. ఇపుడు రాష్ట్రంలో అదే జరుగుతుంది. దేశాన్ని ముందుకు తీసుకువెళ్లే విషయంలో మోదీకి స్పష్టమైన విధానం ఉంది. అందుకే మళ్లీ ఆయన ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. బీజేపీ పాలసీనే హిందుత్వ జాతీయవాదం. దేశానికి ఏం మంచిదో ఆయన అదే చేస్తున్నారు. అవినీతిని తగ్గించడమే కాక దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళుతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు మేము చేయడం లేదు. అన్నివర్గాలు, అన్ని కులాలు, మతాల వారికి సమానంగా పథకాలు అమలు చేస్తున్నాం. ఇలాంటపుడు బీజేపీ మతతత్వ పార్టీ ఎలా అవుతుంది?. కరోనా వంటి గడ్డుకాలాన్ని కూడా అధిగమించి ప్రపంచంలో దేశాన్ని అన్ని విధాలా ముందుకు తీసుకు వెళ్లింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం. ఎకానమీలో దేశం 10వ స్థానం నుంచి 5వ స్థానానికి వచ్చిందంటే మోదీ తీసుకున్న నిర్ణయాలే కారణం. ప్రపంచంలో ఆర్థికంగా దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మోదీ ఎంతో కష్టపడుతున్నారు. ఆయన తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాల వల్ల ప్రభుత్వరంగ సంస్థలు, జాతీయ బ్యాంకులు ఇపుడు లాభాల దిశలో ముందుకు వెళుతున్నాయి. డిజిటల్ ఎకానమీ చేస్తామంటే కొందరు అప్పట్లో నవ్వారు. ఇపుడు దేశమంతా డిజిటల్ లావాదేవీలే జరుగుతున్నాయి. ఇపుడు దేశ ప్రజలు వాడే స్మార్ట్ ఫోన్లలో 70శాతం మనదేశంలోనే తయారవుతున్నాయి. మేకిన్ ఇండియా తరువాత రక్షణ రంగ పరికరాలను కూడా మనమే తయారు చేసుకుంటున్నాం. ఇతర దేశాలు కూడా మన మీదే ఆధారపడే పరిస్థితి ఇపుడు ఉంది. హిందువుల ఎన్నో సంవత్సరాల రామాలయ నిర్మాణ కలను మోదీ సాకారం చేశారు. ప్రభుత్వ నిధులు లేకుండానే అయోధ్యలో రామమందిరం కట్టించారు.

స్కీమ్‌లన్నీ కేంద్రానివే..

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు అమలయ్యే అన్ని స్కీమ్‌లు దాదాపు కేంద్రానివే. రైతువేదికలు, సబ్సిడీ ఎరువులు, బియ్యం సబ్సిడీ, సబ్సిడీపై ఎల్ఈడీ బల్బుల సరఫరా కేంద్రమే చేస్తుంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ కుటుంబ మీడియా ద్వారా ఇవన్నీ తామే చేసినట్లు చెప్పుకుని తప్పుడు ప్రచారం చేసుకుంది. ఇప్పుడిప్పుడే ప్రజలు వీటి గురించి తెలుసుకుంటున్నారు. కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న పథకాల వల్లే తాము ఎక్కువ లబ్ధి పొందుతున్నామని ప్రజలు చెబుతున్నారు. ఓటు బ్యాంకు స్కీమ్‌లు కాకుండా ప్రజలకు పనికి వచ్చే సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నాం. రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా పలు పథకాలు అమలు చేస్తున్నాం. యూరియాను 90శాతం సబ్సిడీతో అందజేస్తున్నాం. బీజేపీది ముమ్మాటికీ అంతోద్యయ సిద్ధాంతమే. కిందిస్థాయిప్రజలకు ఫలాలు అందాలన్నదే మా లక్ష్యం.

అధికార పార్టీకి అభ్యర్థే కరువు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో మాకు పోటీనే లేదు. మేము 3లక్షల మెజార్టీతో గెలుస్తున్నాం. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్ మా దరిదాపుల్లో కూడా లేవు. అసలు వారి అభ్యర్థులు ఎవరో కూడా తెలియడం లేదు. అధికార కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులే దొరకడం లేదు. ఎవరూ లేకపోవడంతో రూ.10వేల కోట్ల భూ దోపిడీ చేసిన వారిని అరువు తెచ్చుకుని పోటీ చేయడానికి సిద్ధమైంది. ధరణీ ముసుగులో రూ. వేల కోట్లు కొల్లగొట్టిన వారిని తీసుకువచ్చి పోటీ చేయిస్తున్నారు. డబ్బుతో రాజకీయాలను శాసించాలనుకుంటున్నారు. అది చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కుదరని పని. ఆ వ్యక్తి మా పార్టీలో చేరేందుకు కూడా ప్రయత్నించారు. అమిత్‌షాను కూడా కలిశారు. రూ. 10వేల కోట్ల భూ కుంభకోణాలు చేసిన వ్యక్తిని బీజేపీలో చేర్చుకుంటుందా? హన్మంతుడి గుడి కూల్చిన వ్యక్తి జైశ్రీరామ్ అని అనగలుగుతాడా? అందుకే ఆయనకు

మిగతా 7వ పేజీలో...

వైద్యం వికటించి యువకుడి మృతి

- క్లినిక్ ఎదుట బంధువుల ఆందోళన



వైద్యుడితో వాగ్వాదానికి దిగిన మృతుడి బంధువులు (ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనివాస్)

పరిగి, మార్చి 20: వైద్యం వికటించి యువకుడు మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా , దోమ మండలం ఊటుపల్లి గ్రామానికి చెందిన బంటు శ్రీనివాస్(29)కు ఛాతిలో నొప్పి రావడంతో పరిగిలోని ఆర్ఎంపీ గఫార్ దగ్గరకు వచ్చాడు. సదరు ఆర్ఎంపీ వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చాడు. మందులు వేసుకున్న నిమిషాల వ్యవధిలోనే శ్రీనివాస్ క్లినిక్‌లో కుప్పకూలిపోయాడు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గఫార్ నిర్లక్ష్యం వల్లనే శ్రీనివాస్ మృతి చెందాడని మృతుడి బంధువులు క్లినిక్ ఎదుట ఆందోళనకు దిగారు. తెలియని వైద్యం ఏలా చేస్తావంటూ ఆర్ఎంపీ డాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. మృతికి కారణమైన గఫార్‌పై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. కాగా, పీపీఆర్ చేసి, సాధారణ మందులే ఇచ్చానని, శ్రీనివాస్ మృతికి తాను బాధ్యుడిని కాదని ఆర్ఎంపీ వైద్యుడు గఫార్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, మృతుడి బంధువులు ఆర్ఎంపీ డాక్టర్‌తో కొంత డబ్బులు మాట్లాడుకుని ఆందోళనను విరమించి మృతదేహన్ని తీసుకెళ్లారు.

డెంగీతో బాలుడి దుర్మరణం

- మర్పల్లి మండలం రావుల్‌పల్లిలో ఘటన



మర్పల్లి, మార్చి 20: డెంగీ, మలేరియా బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన మర్పల్లి మండలంలోని రావుల్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన భుజంగం,పార్వతీ దంపతుల ఏకైక కుమారుడు విఘ్నేష్ (4). గతఆదివారం కుమారుడు ఇంటి ముందు ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలడంతో గమనించిన తల్లిదండ్రులు మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు. విఘ్నేష్‌కు అక్కడి వైద్యులు రక్త పరీక్షలు చేసి బాలుడికి డెంగీ, మలేరియా ఎటాక్ అయిందని, పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తల్లిదండ్రులు నగరానికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఇదిలా ఉంటే, రావుల్‌పల్లి గ్రామంలోని భుజంగం ఇంటి సమీపంలో పెంట కుప్పలు, చెత్తాచెదారం ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దోమల బెడద అధికంగా ఉందని ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని మృతుడి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రయితే దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భుజంగం వాపోయాడు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నవాబుపేట, మార్చి 20: బ్రహ్మోత్సవాల్లో భాగంగా నవాబుపేట మండలంలోని ఎల్లకొండ గ్రామంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కళాకారుల ఆటాపాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. రథోత్సవంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ భరత్‌భూషణ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పట్లోళ్ల భరత్‌రెడ్డి, గ్రామ పెద్దలు, అర్చకులు శ్రీశైలం, శివకుమార్‌శాస్త్రి, చంద్రమౌళి, ప్రవీణ్‌కుమార్, సంతోష్, పూర్ణచందర్, శివప్రసాద్, మణికంట, శశి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా
పనిచేయాలి

కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్, మార్చి 20: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు విధులు నిర్వహించే అధికారులు బాధ్యతతోపని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, తదితర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. జూన్ 6 వరకు వికారాబాద్ , కొడంగల్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ఎన్నికల నియమావళి అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, ఎస్ఎస్‌టీ 6, మూడు షిఫ్టులలో 24/7 పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఏఆర్‌వోలు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులు కల్పించాలన్నారు. ప్రజలతో మర్యాదగా మెదగాలన్నారు. ప్రచార సామగ్రిపై ప్రచురణకర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవో వసు చంద్ర, జడ్పీ సీఈవో సుధీర్, శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) మీడియా సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఎంసీఎంసీ పనితీరును సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, జిల్లా పౌరసంబంధాల అధికారి చెన్నమ్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు కల్టెర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం విద్యాశాఖ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. పరీక్షలు పూర్తి అయిన తర్వాత హ్యాండ్ ఓవర్ చేసే వరకూ పరీక్ష సెంటర్ విడిచి వెళ్లరాదని, చీఫ్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ. జిల్లాలో ప్రతి సెంటర్‌ను చెక్ చేయడం జరుగుతుందన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలి

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి పనులపై దృష్టి సారించాలని నారాయణరెడ్డి అన్నారు. బుధవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా వంద శాతం పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోఆలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 565 గ్రామ పంచాయతీలలో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఆదేశించారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కులకచర్ల, మార్చి 20 : లేబర్ ఇన్సూరెన్స్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జన్ సాహస్ సంస్థ కులకచర్ల మండల కోఆర్డినేటర్ రవీంద ర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రజక సంఘం జిల్లా కార్య దర్శి మోత్కూర్ వెంకటేశ్‌తో కలిసి కార్మికులకు లేబర్ కార్డులు పంపిణీ చేశారు. కార్డుపొందడంతో కార్మికుడి ఇంట్లో ఇద్దరు కూతుళ్లకు వివాహ కానుక కింద రూ.30వేలు, రెండు ప్రసవాలకు రూ.30వేల చొప్పున చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. సాధారణ మరణం జరిగితే రూ. లక్షా 30వేలు, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.6లక్షల 30వేలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో భగత్, సాయికుమార్, సుశీల, రాధ, సునీత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

హరితహారం చెట్లు.. అగ్నికి ఆహుతి



బషీరాబాద్, మార్చి 20: పర్యవేక్షణ లేకపోవడంతో హరితహారం పథకంలో భాగంగా నాటి పెంచిన చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. బషీరాబాద్-తాండూరు రోడ్డు మార్గంలో నాలుగైదేళ్లుగా 12 కిలోమీటర్ల మేర మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఈ మార్గంలో పలుచోట్ల నాటిన మొక్కలు చెట్లుగా ఏపుగా పెరిగాయి. ఇటీవల రైతులు కొందరు తమ పంట పొలాల్లోని వ్యర్థాలను కాల్చేస్తుండటంతో మంటలు రోడ్డు వరకు వ్యాపించి చెట్లు దగ్ధమైపోతున్నాయి. ఈ మార్గంలో పలుచోట్ల అర కిలోమీటరు వరకు చెట్లు కాలిపోయాయి.


రేపే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30

సంగీత ఎ/సి - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00
ఈశ్వర్ ఎ/సి - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00
శివశక్తి ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,2.00,6.00,9.00
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
శ్రీసాయిరాం 70ఎంఎం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00

మన ఘన చరిత్రను ముందు తరాలకి తెలియచేద్దాం




సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

రాజధాని 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
అర్జున్ 70 - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
తారకరామ 70ఎంఎం - కాచిగూడ 11.15,2.15

BHUVANESHWARI PICTURES

నేడే బ్రహ్మాండమైన విడుదల



సుదర్శన్ 35 ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 8.00,11.00
సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

VAISHNAVI ARTS 8801447725

నేడే బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెడ్ - మూసాపేట్ 2.45PM
మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట
వెంకటేశ్వర - గుమ్మడిదల 11.00,2.00,6.00,9.00

TIGER HILLS PRODUCATION 9989522999

రేపే బ్రహ్మాండమైన విడుదల



DISTRIBUTION BY PVR INOX PICTURES

రేపే బ్రహ్మాండమైన విడుదల



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.15,2.15,6.00,9.00
లక్ష్మీకళ సినీప్లెడ్ ఎ/సి - మూసాపేట్ 11.15am

కళారత్న మూవీస్ 7815971127/9848028739

ఈనెల 23న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

ఈనెల 23న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 2.00pm
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
లక్ష్మీకళ సినీప్లెడ్ ఎ/సి - మూసాపేట్ 11.15am
జిఎస్ఎమ్ - మదీనగూడ 1.30pm
వెక్టెస్ సత్వ - కవాడిగూడ 4.15pm

NTR CINEMAS 9030161717

నీట మునిగి ఇద్దరు మృతి

» కుంటలో చేపల వల తట్టుకొని దుర్మరణం

» కొత్తూర్ మండలం గూడూర్‌లో ఘటన

కొత్తూర్, మార్చి 20 : కొత్తూర్ మండలం గూడూర్‌లో గల ఉప్పరోని కుంటలో చేపలవేటకు వెళ్లి ఇద్దరు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మక్తగూడకు చెందిన కిష్టయ్యగౌడ్(65), వడ్డె వెంకటేష్(40) ఇద్దరు మంగళవారం రాత్రి ఉప్పరోని కుంటలో చేపల వేటకు వెళ్లారు. చెరువులో వల వేసి ఇద్దరు చెరువులోకి దిగగా వల కాళ్లకు తట్టి నీట మునిగి మృతి చెందారు. బుధవారం ఉదయం కిష్టయ్యగౌడ్ మృతదేహం కుంటలో తేలింది. పశువుల కాపరి చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు కుంట వద్దకు చేరుకొని గాలించగా వలలో చిక్కుకొని వెంకటేష్ సైతం చనిపోయినట్లు గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. కిష్టయ్యగౌడ్, వెంకటేష్‌ల మృతితో కుంట వద్ద కుటుంబీకుల రోదనలతో మిన్నంటాయి. ఇద్దరు గ్రామస్తుల మృతితో మక్తగూడలో విషాదం అలుముకుంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనం

» 12 ఏళ్ల క్రితం శంకుస్థాపన.. ముందుకు సాగని పనులు



అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

కొడంగల్ రూరల్, మార్చి 20 : కొడంగల్ మండలంలోని నాగారం గ్రామంలో 12 ఏళ్ల క్రితం పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా పంచాయతీ భవనాలకు నిధులు మంజూరయ్యాయి. నాగారం గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు ప్రారంభించి స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. భవనం పూర్తి కాకపోవడంతో గ్రామంలోని మసీద్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారులు భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విదేశాల్లో ప్రతిభ చాటుతున్న తెలుగు విద్యార్థులు

» యూఎస్ కాన్సులేట్ జనరల్ ఆఫీస్ పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెస్

» మల్లారెడ్డి యూనివర్సిటీలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభం




ఇంటర్‌నేషనల్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అలెగ్జాండర్ మెక్‌లారెస్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 20 : విదేశాల్లో చదువుతున్న తెలుగు విద్యార్థులు విద్యారంగంలో ప్రతిభ చాటుతున్నారని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెస్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బుధవారం గ్లోబల్‌ట్రీ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మెక్‌లారెస్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత చదువులు చదివేవారికి దిశానిర్దేశం చేసేందుకు ఏర్పాటు చేసిన ఎడ్యుకేషన్ సెంటర్‌ను సద్వినియోగించుకోవాలన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ నేడు చాలామంది తెలుగు విద్యార్థులు ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్నారని, వారికి విదేశీ చదువుల పట్ల పూర్తి అవగాహన కల్పించటానికి తమ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. ప్రపంచానికి ఉత్తమ ఇంజినీర్లను, డాక్టర్లను అందిస్తున్న ఘనత భారతదేశానికి దక్కుతుందన్నారు. తమ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు చదివి స్థిరపడ్డారని అన్నారు. విదేశాలకు వెళ్లదలచిన వారు అక్కడి యూనివర్సిటీల్లో దరఖాస్తు చేసుకోవటం, వీసా తదితర అంశాల పట్ల పూర్తి అవగాహన కల్పించటంతో పాటు అన్ని పనులు తమ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ సెంటర్ ద్వారా తెలుసుకునే వీలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్లోబల్‌ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకార్ అలపాటి, సౌత్ ఏషియా, ఆస్ట్రేలియా ట్రేడ్ కమిషన్ హెడ్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

మా బలం మోదీనే!

(ఐదో పేజీ తరువాయి)



బీజేపీ తలుపులు మూసివేసింది. ఇలాంటి వారిని కాంగ్రెస్ దగ్గర చేర్చుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజు రోజుకు ఆ పార్టీ మునిగిపోతుంది. వచ్చిన ఆదాయాన్ని అంతా కాళేశ్వరంలో పోసి రాష్ట్ర ప్రజల చేతికి చిప్ప అందించారు. అప్పుల పాలైన రాష్ట్రాన్ని కాంగ్రెస్ మరింత అధోగతి పాలు చేస్తుంది. చేవెళ్లలో ఎవరైనా పోటీ చేయవచ్చు. కానీ ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ మంచి చేయకుండా ప్రజల ఆస్తులను కొల్లగొడితే చూస్తూ ఊరుకోవడం మంచిది కాదు. మంచేదో చెడేదో ప్రజలే నిర్ణయిస్తారు.

వికారాబాద్ దశ, దిశ మారుస్తా

చేవెళ్ల పార్లమెంట్ నుంచి నన్ను గెలిపిస్తే పట్టణ ప్రాంతాలకు దీటుగా గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తా. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు బీజాపూర్ హైవే విస్తరణ పనులకు దాదాపు రూ. వేయి కోట్ల నిధులు మంజూరు నేను చేయిస్తే ఇది మేము చేశామని కొందరు అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే ఈ పనులన్నీ సత్వరమే పూర్తయ్యేలా చూస్తా. అలాగే వికారాబాద్‌కు రోడ్డు, రైలు కనెక్టవిటీ పెంచడం ద్వారా శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తాం. గతంలో కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి వికారాబాద్‌ను శాటిలైట్ టౌన్‌షిప్‌గా చేసేందుకు కేంద్రం నుంచి కొన్ని నిధులు మంజూరు చేయించారు. ఇది చాలా మంచిపనే. కానీ రవాణా కనెక్టివిటీ పెంచకుండా దీన్ని అభివృద్ధి చేయడం సాధ్యం కాదు. నన్ను ఈ ప్రాంత ప్రజలు గెలిపిస్తే మన్నెగూడ వరకు హైవే విస్తరణ పనులు పూర్తిచేస్తాం. అలాగే హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు ఎంఎంటీఎస్‌ను విస్తరించేందుకు కృషి చేస్తాను. హైదరాబాద్ ముంబై బుల్లెట్ రైలు కోసం సర్వే కూడా పూర్తయింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే వికారాబాద్ దశ తిరుగుతుంది. కేవలం 20 నిమిషాల్లో హైదరాబాద్ నుంచి వికారాబాద్‌కు చేరుకోవచ్చు. అలాగే రీజినల్ రింగురోడ్డు కూడా వికారాబాద్ సమీపం నుంచి వెళ్లనుండడంతో ఈ ప్రాంత అభివృద్ధికి ఇది మరింత దోహదమవుతుంది. నియోజకవర్గంలో రైతుల కోసం మెట్ట రైతుల అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసే యత్నం చేస్తాను. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తాం. ఉద్యాన పంటలు పండించే రైతుల కోసం మూడు ప్రణాళికలు సిద్ధం చేశాం. డిమాండ్ ఉన్న సమయంలో పంట వచ్చేవిధంగా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు మార్కెటింగ్, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు కృషి చేస్తాను. తాండూరులో నాపరాతి పరిశ్రమ అభివృదికి కృషి చేస్తా. ఇక్కడ నాపరాతి ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని ఒప్పిస్తాను. దీనివల్ల తాండూరు నాపరాతి విలువ కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పెరుగుతుంది. హైదరాబాద్ శివార్లతో పాటు మారుమూల గ్రామాల్లో కమ్యూనిటీ స్కూళ్ల నిర్మాణాలు చేపతాం. వీటికి ప్రభుత్వమే నిధులు ఇచ్చినా స్థానిక ప్రజలే ఈ స్కూళ్లను నడిపే విధంగా వీటిని తీర్చిదిద్దుతాం. అలాగే ప్రతీ గ్రామంలో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు చేయిస్తాను. ఇప్పటికే ప్రయోగాత్మకంగా 10 గ్రామాల్లో అమలు చేస్తున్నాం.

కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఇక జనం నమ్మరు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ- బీఆర్ఎస్ ఒక్కటేనని వారి మధ్య అవగాహన ఉందని తప్పుడు ప్రచారం చేసి డ్యామేజీ చేసింది. దీన్ని కొంతమంది ప్రజలు నమ్మడంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. వాస్తవానికి గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పై అభిమానంతో ప్రజలు ఓట్లు వేయలేదు. కేసీఆర్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కు వెళ్లింది. వారు చేసిన తప్పుడు ప్రచారం కూడా మాకు నష్టం కలిగించింది. ఇపుడు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కవిత అరెస్టుతో బీఆర్ఎస్‌కు మాకు ఎలాంటి అవగాహన లేదనేది స్పష్టమైంది. ప్రజలకు వాస్తవం తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఇపుడు కాంగ్రెస్‌కు ఓటేసిన వారితో పాటు బీఆర్ఎస్‌కు ఓటేసిన వాళ్లు కూడా బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యుడు

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కో ఆపరేటివ్ సొసైటీ : ఎస్పీ

వికారాబాద్, మార్చి 20 : పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లాలో కో ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో కోఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించారు. సొసైటీ ద్వారా చేసిన వార్షిక కార్యక్రమాలు.. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి.. సభ్యులకు అందాల్సిన బెనిఫిట్స్, వెల్ఫేర్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎవరైనా మరణించినా, రిటైర్మెంట్ సమయంలో, పోలీస్ సిబ్బంది పిల్లల ఉన్నత చదువుల కొరకు ప్రతీ సంవత్సరం మెరిట్ స్కాలర్ షిప్‌లు కోఆపరేటివ్ సొసైటీ తరఫున ఆర్థిక చేయూతనందించాలన్నారు. భవిష్యత్తులో సొసైటీ ద్వారా చేపట్టాల్సిన పనులను బాడీ మెంబర్స్ అందరూ కలిసి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీస్ తరఫున ఎల్లప్పుడూ ముందుంటామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ సీఐ రాజు, వెంకటేశం, పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాలా కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



కబ్జాకు గురవుతున్న నాలా

నవాబుపేట, మార్చి 20 : నాలా కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నవాబుపేట మండలంలోని మైతాబ్‌ఖాన్‌గూడ మాజీ సర్పంచ్ అనితా రంగారెడ్డి గ్రామస్తులతో కలిసి బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్లు 402, 403లో గల ప్రభుత్వ నాలా కబ్జాకు గురవుతుందన్నారు. కాగా, సమీపంలోని 200 ఎకరాల ప్రభుత్వ భూమి గల గుట్టపై నుంచి వచ్చే వర్షపు నీరు నాలా ద్వారా బయటకు వెళుతుందని, హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త కబ్జా చేస్తుండటంతో గ్రామస్తులు ప్రశ్నించగా.. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి నాలా కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



భరత్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కేంద్రంలో మరోసారి బీజేపీదే అధికారం

కడ్తాల్, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుపొంది మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. బీజేపీ ప్రజాభిమానం ముందు స్వార్థ శక్తుల కుట్రలు ఫలించవని వారు చెప్పారు. కడ్తాల మండలంలో బుధవారం వారు పర్యటించారు. వారికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ఈ సందర్భంగా రాములు, భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఎదురు లేని శక్తిగా తయారైందన్నారు. ప్రధాని మోదీ పాలనా దక్షతతో పదేళ్లలో భారత్ అద్భుత విజయాలు సాధించి ప్రపంచ దేశాల్లో కీర్తి ప్రతిష్ఠలు పొందిందన్నారు. మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూడూరు గోపాల్ రెడ్డి, రమేశ్, వీరయ్య, మన్యనాయక్, రవిరాథోడ్, పాల్గొన్నారు.

డీహెచ్‌ఎం 117 మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడి

» మొక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నగేష్‌కుమార్

» ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా మొక్కజొన్న విత్తనాలు

కొందుర్గు, మార్చి, 20 : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో భాగంగా ఒక గ్రామంలో 70 శాతం ఎస్సీ రైతులు ఉన్న గ్రామానికి డీహెచ్‌ఎం 117 మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, ఆ విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నగేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని భైరంపల్లికి చెందిన రైతు భాస్కర్ పొలంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మొక్కజొన్న క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీహెచ్‌ఎం 117 మొక్కజొన్న విత్తనాల కోసం భైరంపల్లిని ఎన్నిక చేశామని తెలిపారు. గ్రామంలోని 25మంది ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి 8 కిలోల విత్తనాలను ఉచితంగా అందించామని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ సునీత, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ పరమేశ్వరి, మండల వ్యవసాయాధికారి మధుసూదన్, ఏఈవోలు వాసవి, లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు

రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ

» ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి



షాద్‌నగర్‌అర్బన్, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనతో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవుతోందని మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లోని వీ కన్వెన్షన్ హాలులో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే షాద్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, బీఆర్ఎస్ నాయకులు పులిమామిడి శ్రీశైలంగౌడ్, నడికూడ యాదగిరియాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మన్నె జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తూ, ప్రజల మన్ననలను పొందుతున్నారని అన్నారు. అధికారం చేపట్టగానే ప్రగతి భవన్‌కు ఉన్న ఇనుప కంచెను బద్దలు కొట్టి, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీలు పి. వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్న మోదీ ప్రభుత్వం

» చేవెళ్లలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం : సబితా ఇంద్రారెడ్డి




మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్/ శంషాబాద్, మార్చి 20 : కేసీఆర్‌ని నేరుగా ఎదుర్కొనే సత్తా లేకనే మోదీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తూ.. అక్రమ కేసులు బనాయిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. శంషాబాద్‌లోని బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో పదేళ్లు పాలించిన బీజేపీ, రాష్ట్రంలో మూడు నెలల్లోనే ప్రజల్లో నమ్మకం కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నల్లధనం తెచ్చి, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఉన్న ఉద్యోగాలు లేకుండా మోదీ చేశారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి : ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీలు సురభివాణిదేవి, దయనంద్ గుప్తా, ఎమ్మెల్యేలు ఆరెకపూడి గాంధీ, ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి, బడుగు, బలహీన వర్గాల ప్రతినిధి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని, ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.











గురునాథ్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకుల సన్మానం

కొడంగల్ రూరల్, మార్చి 20: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే ఆర్.గురునాథ్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు తార్యానాయక్, పాండప్ప, భీమ్‌రెడ్డి, శ్యామప్ప, ఎంపీటీసీ రాములు తదితరులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను కలిసిన నాయకులు



ఘట్‌కేసర్, మార్చి 20 : ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన నాగరి ప్రీతమ్‌ను బుధవారం పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈమేరకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్లలో గల ప్రీతమ్ నివాసంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చైర్మన్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్‌యాదవ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎర్ర రాజు తదతరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని



ఘట్‌కేసర్, మార్చి 20 : మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్య యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని బోయిన్‌పల్లిలో గల ఆయన నివాసంలో కలిసి మల్లారెడ్డి శాలువాతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇటీవల ఘట్‌కేసర్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు పావని తెలిపారు.

కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే సేవలు ప్రారంభం



సేవలు ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ హరిచందన

కొడంగల్, మార్చి 20: కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే సేవలు ప్రారంభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిచందన తెలిపారు. ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి రావడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయనియ ఆమె తెలిపారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన పోస్టుమార్టం గదిని వినియోగంలోకి తెచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు సాకేత్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం గ్రామాధ్యక్షుడిగా అమృతయ్య



సంఘం అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, మార్చి 20 : కొండాపూర్ గ్రామ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడిగా నీరటి అమృతయ్యను ఆ సంఘం సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బంద్యప్పను ఎన్నుకున్నారు. మిగతా పాలకవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని సభ్యులు చెప్పారు. కాగా, నూతన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సంఘం సభ్యులు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వారిని అభినందించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అందరు ఐకమత్యంగా ఉంటూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లొంక నర్సిములు, భీమయ్య, చందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శ

బషీరాబాద్, మార్చి 20: మండలంలోని కొత్లాపూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ రవీందర్ తల్లి జమ్మబాయి(80) మంగళవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నవాంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు రాముునాయక్ తదితరులున్నారు.



మొక్కల సంరక్షణ బాధ్యతగా చేపట్టాలి

- డీఆర్‌డీవో సాంబశివరావు
- శామీర్‌పేట హరితహారం నర్సరీ పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్డీవో సాంబశివరావు

శామీర్‌పేట, మార్చి 20 : పంచాయతీ పరిధిలో చేపట్టిన హరితహారం మొక్కల పెంపకం, సంరక్షణ బాధ్యతగా చేపట్టాలని డీఆర్‌డీవో సాంబశివరావు అధికారులు, సిబ్బందికి సూచించారు. శామీర్‌పేట పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరితహారం నర్సరీని బుధవారం సాంబశివరావు సందర్శించి పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, సిబ్బంది పనితీరుపై ఆయన పర్యవేక్షణ జరిపారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో హరితహారం మొక్కలకు ప్రతీరోజు నీరు పోయాలని, ఎరువులను తప్పనిసరిగా వేస్తూ మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. జూన్, జూలై వరకు హరితహారం మొక్కల పెంపకం దశను పూర్తిచేయాలన్నారు. స్థానిక పంచాయతీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. శామీర్‌పేట ఎంపీడీవో మమతాబాయి, ఈసీ సూర్య, టీఏ కదిర్‌వెంకట్, హరితహారం ఫీల్డ్ అసిస్టెంట్ కవిత, గురువేశ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

- వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మర్పల్లి, మార్చి 20: ప్రతీ ఒక్కరు లోకసభ ఎన్నికల నియమావళిని పాటించాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. లోకసభ ఎన్నికల కోడ్ అమలు కావడంతో ప్రజలు రూ.50వేల కంటే ఎక్కువ ఆధారాలు లేకుండా తరలిస్తే సీజ్ చేయనున్నట్లు తెలిపారు. బుధవారం మండలంలోని కొంశెట్టిపల్లి గ్రామ సమీపంలో గల చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బందితో కలిసి ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. మోమిన్‌పేట్ సీఐ అంజనేయులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రూ.50వేల కంటే ఎక్కువుంటే సీజ్ చేస్తాం

మోమిన్‌పేట్ : ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సరైన ఆధారాలు లేకుండా రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళితే సీజ్ చేస్తామని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండలంలోని మేకవనంపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు.



మోమిన్‌పేట్ : మేకవనంపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అంజనేయులు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా

యాలాల, మార్చి 20 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని యాలాల ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అన్నారు. బుధవారం యాలాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట వ్యవసాయ శాఖపై సమీక్ష కొనసాగుతుండగా మండలంలో ఎంత మందికి రైతు బంధు పడిందని మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తంరావు సభ దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయాధికారుల వద్ద పూర్తి సమాచారం లేకపోవడంతో తడబడ్డారు. ఆ తర్వాత ఫోన్‌లో సమాచారాన్ని సేకరించి సభలో విన్నవించారు. పలు శాఖలపై సర్వసభ్య సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలీల, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పరిగి, మార్చి 20 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండోరోజు బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవిష్వక్సేన ఆరాధనం, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశణం, కంకణధారణం, రుత్విక్‌వరణం, హోమగుండాలతో దేవయజ్ఞం, విష్ణుసహస్రనామ యజ్ఞం, చండీహోమం, మండల ఆరాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చండియాగంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. నిర్వాహకులు అన్నదానం చేశారు.



పరిగి : చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

ఘనంగా రామలింగేశ్వరస్వామి పూజలు

మేడ్చల్ టౌన్ : మేడ్చల్ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున గ్రామస్తులు స్వామివారి రథాన్ని ఆలయం వరకు తీసుకొచ్చారు. పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 6వ వార్డు కౌన్సిలర్ రామన్నగారి మణికంఠగౌడ్ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, సత్యనారాయణ, మోనార్క్, సందీప్, పోచయ్య నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ టౌన్ : రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న నాయకులు

స్వార్థపరులే బీఆర్ఎస్‌ను వీడారు

- ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటు
- విలేకరుల సమావేశంలో గులాబీ నాయకులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తాండూరు రూరల్/బషీరాబాద్, మార్చి 20 : స్వార్థపరులే బీఆర్ఎస్ పార్టీని వీడారని తాండూరు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బుధవారం తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, నాయకులు శ్రీనివాసాచారి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సాయిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు హన్మంతు తదితరులు మాట్లాడారు. పదవులు, డబ్బుల కోసం ఆశపడేవారే బీఆర్ఎస్‌ను వీడారని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలు పదవుల కోసమే కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. చేవెళ్ల ప్రజలకు రంజిత్‌రెడ్డి ఎవరో తెలియకున్నా ఓట్లు వేసి గెలిపిస్తే పార్లమెంటుకు, జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. రంజిత్‌రెడ్డి మోసపూరితంగా కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ పదవి పొందిన మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని, వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డబ్బు, పదవుల కోసమే కాంగ్రెస్‌లో చేరిన వారిని లోకసభ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామన్నారు. కేసీఆర్ చేవెళ్ల నుంచి బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌కు ఎంపీగా పోటీచేసే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, అలా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో, బీజేపీలో చేరతారన్న ప్రచారంలో నిజం లేదన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులైనా చేసింది శూన్యమేనని బీఆర్ఎసన్ నాయకులు విమర్శించారు. ఆరు గ్యారెంటీలను ఇప్పటివరకు అవి పూర్తిగా అమలు చేయలేదన్నారు. కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లు ఖర్చు చేస్తున్నారని, తాండూరు నియోజకవర్గానికి నిధులు ఇవ్వరన్నారు. కాగా, బీఆర్ఎస్ పార్టీలోంచి కొందరు నేతలు వెళ్లిపోయినా పార్టీకి వచ్చిన నష్టమేమీలేదని ఆ పార్టీ బషీరాబాద్ మండలాధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సునీతారెడ్డి, రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం స్వార్థం కోసమేనని ఆయన అన్నారు.

27న కార్యకర్తల సమావేశం

లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 27న తాండూరులో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితోపాటు జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. తాండూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ వెంకట్‌రెడ్డి, బషీరాబాద్ మండలాధ్యక్షులు నర్సిరెడ్డి, నరేందర్‌గౌడ్, కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ సీడీపీవో వెంకటేశ్వరమ్మ

ధారూరు, మార్చి 20 : గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవటం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని, చిరుధాన్యాలతో రక్తహీనత దరిచేరదని ఐసీడీఎస్ సీడీపీవో వెంకటేశ్వరమ్మ సూచించారు. మండల పరిధిలోని నాగసమందర్ గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బాల్యారంభ విద్యపై ప్రతిజ్ఞ చేసిన అనంతరం జరిగిన సమావేశంలో వెంకటేశ్వరమ్మ మాట్లాడారు. మార్చి 9నుంచి 23వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పుట్టిన బిడ్డకు సకాలంలో ముర్రుపాలు తాగించాలని, 6 నుంచి 24 నెలల వరకు తల్లిపాలు పట్టించాలని, 6 నెలలు నిండిన పిల్లలకు చనుబాలతో పాటు పోషకాహారం తినిపించాలని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషక పదార్థాలు, స్వదేశీ బొమ్మలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, జగదీశ్వరి, భాగ్యలక్ష్మి, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.



ధారూరు : మాట్లాడుతున్న సీడీపీవో వెంకటేశ్వరమ్మ

అంగన్‌వాడీ కేంద్రంలో 'అన్నప్రాసన'

పూడూరు : మండలంలోని సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ అరుణాదేవి చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి మండల కమిటీ



నియామకపత్రం అందిస్తున్న సుధీర్

దోమ, మార్చి 20: భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ ఆధ్వర్యంలో బుధవారం ఆ సమితి దోమ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కొత్తపల్లి గ్రామానికి చెందిన చుక్కయ్య, ఉపాధ్యక్షుడిగా వెంకటేశంను ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆరు గ్యారెంటీలను సకలాంగులకే ప్రకటించారని, దివ్యాంగులకు ఇప్పటివరకు ఏ విధమైన పథకం ప్రకటించలేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. వికారాబాద్ జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీల్లో మేడిపల్లికలాన్ విద్యార్థుల ప్రతిభ

పూడూరు, మార్చి 20 : మండల కేంద్రంలో జరిగిన క్విజ్ పోటీల్లో మేడిపల్లికలాన్ ఎంపీయూపీఎస్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో భాగంగా బహుమతి గెలుపొందారు. ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు బహుమతితో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ఉత్సాహంగా స్వయం పాలన దినోత్సవం

దౌల్తాబాద్, మార్చి 20: మండలంలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా శిరీష, డిప్యూటీ డీఈవోగా దీక్షిత, ఎంఈవోగా అశ్విని, హెచ్‌ఎంగా మునెమ్మ వ్యవహరించారు. హెచ్‌ఎం లోకేశ్, ఉపాధ్యాయులు ఆశమ్మ, నర్సిములు, యామిని పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

క్రైం కార్నర్

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

భర్తను హతమార్చిన భార్య

- ప్రియుడు, మరో వ్యక్తితో కలిసి కడతేర్చిన వైనం



వివరాలు వెల్లడిస్తున్న పరిగి సీఐ శ్రీనివాస్

పూడూరు, మార్చి 20 : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భార్య భర్తను హత్య చేసినట్లు పరిగి సీఐ శ్రీనివాస్ తెలిపారు. పూడూరు మండలం మన్నెగూడకు చెందిన మృతుడు హరిజన్ సంజయ్ భార్య అనితకు దోమ మండలం శివారెడ్డిపల్లికి చెందిన కాళ్లపురం గోపాల్ మేనమామ వరుస అవుతాడు. కాగా, అనిత గోపాల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈక్రమంలో భర్త సంజయ్ అడ్డుతొలగించుకోవాలని గోపాల్, మరో వ్యక్తి బల్ల లాలుప్రసాద్‌తో కలిసి పథకం పన్నారు. ప్లాన్‌ప్రకారం గోపాల్, లాలుప్రసాద్‌లు ఈనెల 17వ తేదీన రాత్రి సంజయ్‌ని కారులో ఎక్కించుకుని వికారాబాద్ తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించి తిరిగి ఎన్కెపల్లి గ్రామ శివారులోని జిందాథిలిస్మాత్ పామ్‌ల్యాండ్ మెయిన్‌గేటు వద్దకు తీసుకొచ్చి మళ్లీ మద్యం తాగించారు. అనంతరం వారు అనుకున్న విధంగా లాలుప్రసాద్‌తో కలిసి గోపాల్ తమ వద్ద ఉన్న మద్యం బాటిల్‌తో సంజయ్ తలవెనుక భాగంలో బలంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా కర్రతో దాడి చేయడంతో సంజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యచేసిన ఆ ఇద్దరూ అక్కడినుంచి పారిపోయారని సీఐ వివరించారు. కేసు దర్యాప్తులో భాగంగా గోపాల్, లాలుప్రసాద్, అనితలను విచారించగా, నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. నిందితులను జైలుకు పంపడం జరిగిందని వివరించారు. కాగా, ఈ ఘటనపై వివరాలు వెల్లడించేందుకు పోలీసులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయకుండానే ఓ పత్రికా విడుదల చేశారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. రెండు ట్రాక్టర్లు సీజ్

పెద్దేముల్, మార్చి 20 : అనుమతులు ఒకచోట ఉండగా మరోచోటుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని తహసీల్దారుకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలానికి సంబంధించి ఇసుక అనుమతులు కలిగిన రెండు ట్రాక్టర్లు అక్రమంగా పెద్దేముల్ మండలం కందనెల్లి సమీపంలో తిరుగుతుండడంతో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతిపత్రాలు పరిశీలించగా.. తాండూరు మండలానికి సంబంధించిన పర్మిట్లు ఉన్నాయి. ఇసుక పెద్దేముల్ మండలంలో విక్రయించేందుకు తీసుకువచ్చారని గుర్తించి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లను పెద్దేముల్ మండల తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై గిరి తెలిపారు.

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

పరిగి, మార్చి 20 : కొత్తగా మండల, బూత్ కమిటీలు వేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవరెడ్డి, యు.రమేశ్‌లు అన్నారు. బుధవారం పరిగిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కొత్తగా మండల అధ్యక్షులను నియమించామని, వారి సమక్షంలో మండల కమిటీతో పాటు అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలను పటిష్టం చేసేలా కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి విశ్వేశ్వరరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను బీజేపీలో చేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు కరణం ప్రహ్లాద్‌రావు, గిరమోని శ్రీనివాస్, ఏవీ రాములు, ఘణాపూర్ వెంకటయ్యగౌడ్, రాముయాదవ్, పెంటయ్య గుప్తా, యాదయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్, మార్చి 20 : తాండూరు మండలం అంతారం శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతిలో బ్యాక్‌లాగ్ అడ్మిషన్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ డి.సుభాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-2025 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలు పొందేందుకు అర్హులైన, ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో టీజీటీడబ్ల్యూగురుకులమ్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దేవాదాయ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి





దేవరయాంజాల్ పరిధిలో నిర్మిస్తున్న గోదాం; తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనారాయణ

శామీర్‌పేట, మార్చి 20 : మండలంలోని దేవరయాంజాల్ పరిధిలోని దేవాదాయ, ధర్మదాయ శాఖకు చెందిన భూముల్లో అక్రమంగా నిర్మించిన గోదాములను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ లక్ష్మీనారాయణ తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు బుధవారం మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ యాదగిరిరెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని, ప్రభుత్వ భూముల్లో దర్జాగా అక్రమార్కులు జరుపుతున్న నిర్మాణాల ఫొటోలను అందజేశారు. దేవరయాంజాల్ పరిధిలోని సర్వేనెంబర్-63లో దేవాదాయ శాఖకు చెందిన ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు రెండు నెలలుగా యథేచ్ఛగా పెద్ద పెద్ద గోదాములను నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల తూంకుంట మున్సిపల్ కమిషనర్‌ను కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. తహసీల్దార్ స్పందిస్తూ న్యాయవిచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యువకులకు వాలీబాల్ కిట్ అందజేత



కిట్‌ను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, మార్చి 20 : మండలంలోని తుపాలకు తండా పంచాయతీలో యువకులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు వినోద్‌కుమార్ బుధవారం వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలని వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, దశరథ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.